శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:46 సూర్యాస్తమయం - సా. 6:13 తిథిః విదియ రా. 9:56 వరకు తరువాత తదియ సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) రా. 11:07 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం అతిగండ ఉ. 7:18 వరకు కరణం తైతుల ఉ. 9:04 వరకు గరజి రా. 9:56 వరకు వర్జ్యం తె. 5:48 నుండి ఉ. 7:32 వరకు దుర్ముహూర్తం ఉ. 9:04 నుండి ఉ. 9:50 వరకు మ. 12:53 నుండి మ. 1:38 వరకు రాహుకాలం ఉ. 11:04 నుండి మ. 12:30 వరకు యమగండం మ. 3:22 నుండి సా. 4:48 వరకు గుళికాకాలం ఉ. 8:12 నుండి ఉ. 9:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:10 నుండి తె. 5:58 వరకు అమృత ఘడియలు సా. 4:24 నుండి సా. 6:08 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు

e-paper

# ఈ -కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

రెండుసార్లు బ్రేకప్, ఇద్దరూ నాపై చేతులెత్తేవారే..

తెలుగులో అవకాశాలు రావట్లేదు!

సినీ కబుర్లు



శుక్రవారం | 14-2-2025 | హైదరాబాద్ | e-kaburu.com





# సాంకేతికరంగాలో సత్తాచాటాలి

## హైదరాబాద్‌లో కొత్త మైక్రోసాఫ్ట్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



- భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే..
- 1.1 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో మైక్రోసాఫ్ట్ క్యాంపస్ ఏర్పాటు
- ఏఐ విస్తరణతో యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు
- మైక్రోసాఫ్ట్, తెలంగాణ ప్రభుత్వం కలిసి 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ విద్య
- హైదరాబాద్ ఐటీ రంగంలో మరో కీలక మైలురాయి

**రాబోయే భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ గచ్చిబౌలిలో కొత్త మైక్రోసాఫ్ట్ క్యాంపస్ నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.**



**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 13 : ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు మంత్రి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలో 1.1 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త మైక్రోసాఫ్ట్ క్యాంపస్ ఏర్పాటు చేయబోతున్నందుకు ఆ కంపెనీ ప్రతినిధులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేని అన్నారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్యాంపస్ ఏర్పాటు కావడం ఐటీ ఇండస్ట్రీ జర్నీలో ఇదొక అద్భుతమైన మైలురాయి అని కొనియాడారు. హైదరాబాద్ మహా నగరంతో మైక్రోసాఫ్ట్ సంస్థకు సుధీర్ఘ భాగస్వామ్యం ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా నగరంలో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో ఇప్పటికే ఎంవోయూ కుదుర్చుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇటీవలే ఆ కంపెనీ భారత్‌కు వచ్చి 25 వసంతాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. మైక్రోసాఫ్ట్, తెలంగాణ ప్రభుత్వం భాగస్వామ్యంతో సుమారు 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేస్డ్ విద్యను ప్రవేశపెట్టబోతున్నామని ప్రకటించారు.



## అమెరికాలో ప్రధాని మోదీకి

# ఘన స్వాగతం


- అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్ డీసీ చేరుకున్నా ప్రధాని నరేంద్ర మోదీ
- విమానాశ్రయంలో ప్రధానికి ఘన స్వాగతం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ద్వైపాక్షిక సమావేశానికి సిద్ధం
- ప్రధాని మోదీ పర్యటన ద్వైపాక్షిక సంబంధాల పరంగా కీలకం
- దిగుమతి సుంకాలు, వ్యాపార ఒప్పందాలు, వంటి అంశాలు చర్చలో ఉండే అవకాశం
- ప్రవాస భారతీయులతో మోదీ భేటీ.. 'భారత్ మాతా కీ జై' నినాదాలతో హర్షాతిరేకాలు
- అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసి గబ్బర్డ్‌తో ప్రధాని భేటీ

**ప్రధాని నరేంద్ర మోదీ తన విదేశీ పర్యటనలో భాగంగా అమెరికా చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. జనవరి 20న ట్రంప్ ప్రమాణ స్వీకారం తర్వాత అమెరికాను సందర్శించిన కొద్దిమంది ప్రపంచ నేతలలో ప్రధాని మోదీ కూడా ఉన్నారు.**

**ఈ-కబురు,వాషింగ్టన్ డీసీ**

ఫిబ్రవరి 13 : ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య జరిగే సమావేశంలో అనేక ద్వైపాక్షిక అంశాలును చర్చించే అవకాశం ఉంది. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత వివిధ దేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలు విధిస్తామని హెచ్చరిస్తున్న సమయంలో ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

'కొద్దిసేపటి క్రితమే వాషింగ్టన్ డీసీ చేరుకున్నాను. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను (మిగతా 2 వ పేజీలో)



## మకావును మట్టికరిపించి..

క్వార్టర్ ఫైనల్లో భారత్

ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన టీమిండియా షట్లర్లు

ఆట



## పండుగైన బ్యాంకులు పనిచేయాల్సిందే

ఆర్‌బిఐ నిర్ణయం

బిజినెస్





# గూగుల్‌తో తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందం

## హైదరాబాద్‌లో ఏఐ కేంద్రం ఏర్పాటు కోసం గూగుల్‌తో తెలంగాణ ప్రభుత్వ ఎంవోయూ

## వ్యవసాయం, విద్య, రవాణా, ప్రభుత్వ డిజిటల్ కార్యకలాపాలకు గూగుల్ ఏఐ కేంద్రం సహకారం



**రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాన్ని ఉపయోగించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్‌తో ఒప్పందం చేసుకుంది. ప్రధానంగా వ్యవసాయం, సుస్థిరాభివృద్ధి, పరిపాలన, రవాణా, విద్య తదితర కీలక రంగాల్లో ఏఐ ఆధారిత సేవలను విస్తృతం చేయనున్నారు. భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా డిజిటల్ నైపుణ్యాలతో శ్రామిక శక్తిని సన్నద్ధం చేసేందుకు వ్యూహాత్మక సహకారం గూగుల్ సంస్థ అందించనుంది.**

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 13 : హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు గూగుల్ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, గూగుల్ ప్రతినిధులు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం గూగుల్ రైతులకు వ్యవసాయ సంబంధిత ఏఐ ఆధారిత పరిష్కారాలు అందించనుంది. రవాణా సదుపాయాలను మెరుగుపరిచే డేటా ఇంటిగ్రేషన్ సదుపాయాల కల్పనలో నూ భాగస్వామ్యం పంచుకుంటుంది. రైతులకు అవసరమైన ఇన్పుట్, రెడిట్, మార్కెటింగ్ సదుపాయాలన్నీ అనుసంధానం చేస్తూ తెలంగాణ ఓపెన్ అగ్రికల్చర్ నెట్‌వర్క్ ను ప్రారంభిస్తుంది. (మిగతా 2 వ పేజీలో)



## ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణకు

# అన్యాయం జరగనివ్వం

- కృష్ణా జలాల కేటాయింపులో తెలంగాణ ప్రజల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన WP1230/2023 పిటిషన్‌పై సుప్రీంకోర్టులో గురువారం విచారణ
- విచారణ అనంతరం.. కోర్టు తదుపరి విచారణను ఫిబ్రవరి 27వ తేదీకి వాయిదా వేసినట్లు మంత్రి వెల్లడింపు

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 13 : కృష్ణా జలాల విషయమై ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణకు అన్యాయం జరగనివ్వమని, రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల కేటాయింపు వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ WP1230/2023పై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులతో కలిసి విచారణకు హాజరయ్యారు.

అనంతరం ఆయన మట్లాడుతూ.. కోర్టు విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసిందని, ఈ నెల 25 తేదీ కల్లా అన్ని వాదనలపై షార్ట్ నోట్స్ సమర్పించాలన్నారని చెప్పారు. (మిగతా 2 వ పేజీలో)

# ఏడు ఫ్లైఓవర్ల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్..

## అధికారులకు రేవంత్ కీలక ఆదేశం




**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 13 : ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న కోర్ అర్బన్ ఏరియాను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు, నగరవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన డ్రోన్ సర్వేను కోర్ అర్బన్ ఏరియా మొత్తం నిర్వహించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు.నగరంలో గృహాలు, మంచినీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, మురుగునీటి వ్యవస్థకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించాలని రేవంత్ రెడ్డి సూచించారు. తద్వారా నగరంలో నివాస ప్రాంతాలకు మౌలిక సదుపాయాల విషయంలో అవసరాలకు తగిన విధంగా ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాటు చేసే వీలుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైతే గూగుల్ సాంకేతిక సహకారాన్ని తీసుకుని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చెరువుల పునరుద్ధరణ, నాలాల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని ఆయన సూచించారు.

ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రధానమైన ఏడు కూడళ్లలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. త్వరలోనే వీటికి టెండర్ల ను పిలువాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భూసేకరణ, ఇతర పనులను పూర్తి చేసి వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస రాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, సీఎంవో అధికారి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# డిప్యూటీ సీఎం భట్టి ప్రీ బడ్జెట్ సమావేశం

**తెలంగాణ రాష్ట్రం 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పన కసరత్తులో భాగంగా డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గురువారం డాక్టర్ బీఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యారు.**

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 13 : ఆర్ ఆండ్ బీ శాఖ, ఆర్థిక శాఖ అధికారులతో భట్టి ప్రీ బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆయా శాఖలు అందించిన ప్రతిపాదనలపై చర్చించారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే ఆర్థిక శాఖ అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను స్వీకరించింది. శాఖలు, పథకాల వారీగా రాబడులు, వ్యయాల అంచనాలను, ఉద్యోగుల జీతభత్యాల వివరాలను అన్ని శాఖలు పంపించాయి. ఈ ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రీ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల ప్రతిపాదనలపై ఇప్పటికే చర్చించారు. ఒక్కో ప్రభుత్వ శాఖలతో భట్టి సమావేశమవుతూ బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ కసరత్తు చేస్తున్నారు.

# 'అప్పుల కుప్పగా తెలంగాణ'..

**'మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు'**

**తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అనేక చర్యలు తీసుకున్నట్లు వివరింపు**

**తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర వ్యాఖ్యలు**



**ఈ-కబురు,ఢిల్లీ**

ఫిబ్రవరి 13 : తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రం .. ఇప్పుడు అప్పుల కుప్పగా మార్చారు'అని రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాట్లాడారు. నిర్మల సీతారామన్ ఇంకా ఏమన్నారంటే?

'ఏపీ విభజన సమయంలో తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉంది. కానీ ఇప్పుడు అది అప్పుల కుప్పగా తయారైంది. నేను ఏ పార్టీని తప్పుబట్టడం లేదు. ఇందిరాగాంధీ గెలిచిన మెదక్ నియోజకవర్గంలో తొలుత రైల్వే స్టేషన్‌ను మోదీ ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించింది మోదీ ప్రభుత్వమే.

ఎరువుల ఉత్పత్తిలో రికార్డు స్థాయిలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని పెంచాం. నిజామాబాదులో పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ఘనత ప్రధానిదే. అత్యద్భుతమైన పసుపు పండే ప్రాంతం నిజామాబాద్. తెలంగాణకు చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జహీరాబాద్‌లో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది.

వరంగల్‌లో పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు, సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం, బీబీనగర్‌లో ఎయిమ్స్, 2605 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం, భారత్ మాల కింద నాలుగు గ్రీన్ కారిడార్లు, రైల్వేల అభివృద్ధి కోసం తెలంగాణకు రూ.5337 కోట్ల బడ్జెట్ కేటాయింపు, ఏరుపాలెం నంబూరు మధ్య , మల్కాన్ గిరి పాండురంగాపురం మధ్య 753 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణం,ఐదు కొత్త వందేభారత్ ట్రైన్ల కేటాయింపు, 40రైల్వే స్టేషన్స్ రీడెవలప్, పీఎం ఆవాస్ అర్బన్ కింద రెండు లక్షల ఇళ్ల నిర్మాణం స్వచ్ఛ భారత్ మిషన్ కింద 31 లక్షల టాయిలెట్ల నిర్మాణం, జల్‌జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్ల కనెక్షన్లు, 82 లక్షల ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల మంజూరు, 199 జనఔషధి కేంద్రాలను ఏర్పాటు..ఇలా చెప్పుకుంటూ పోతే అనే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాము' అని వ్యాఖ్యానించారు.

# ఎట్టకేలకు ఫాంహౌస్ వీడనున్న కేసీఆర్

- ఈనెల 19న తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం
- సమావేశానికి కేసీఆర్ అధ్యక్షత, కేటీఆర్ కార్యచరణపై ఆదేశాలు
- సిల్వర్ జూబ్లీ వేడుకలు, పార్టీ సభ్యత్వ నమోదు, నిర్మాణాత్మక అంశాలపై చర్చ
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై చర్చ, ప్రభుత్వ హామీల సాధనపై కార్యాచరణ
- పార్టీ శ్రేణుల దిశానిర్దేశం కోసం కీలక వ్యూహాల ప్రకటన



**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎట్టకేలకు ఫాంహౌస్ ను వీడనున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటి నుంచి కేసీఆర్ తన ఫాంహౌస్ కే పరిమితం అయి.. అక్కడి నుంచే పార్టీ వ్యవహారాలన్నీ నడిపిస్తున్నారు.**

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 13 : అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు కేసీఆర్ ఫాంహౌస్ జీవితంపై ఎన్ని విమర్శలు చేసినా.. వాటిని పట్టించుకోకుండా రాష్ట్రంలో జరుగుతున్న అరాజకీయ పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తూ.. పార్టీ క్యాడర్ అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేస్తూ వచ్చారు. ఇకపై ప్రత్యక్షంగా ముందు నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి కేసీఆర్ సిద్ధమయినట్టు తెలుస్తోంది. అందులో భాగంగా ఈనెల 19వ తేదీన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రకార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు.ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్కు సమావేశానికి సంబంధించిన కార్యచరణపై ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 19వ తేదీన మధ్యాహ్నం 1 గంటనుండి హైద్రాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి కేసీఆర్ అధ్యక్షత వహించనుండగా.. పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పోరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డిసిసిబి, డిసిఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇంచార్జీలు హాజరు కానున్నట్టు కేటీఆర్ తెలియజేశారు. కాగా ఈ సమావేశంలో.. బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం తదితర నిర్మాణాత్మక అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించనున్నామని కెటిఆర్ తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలమీద ప్రధానంగా చర్చ జరగున్నది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణ పై సమగ్ర చర్చ జరగనున్నది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం కార్యకర్తలు శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు విధానాల పై ఈ విస్తృతస్థాయి సమీక్షా సమావేశంలో చర్చించనున్నారని కేటిఆర్ తెలిపారు. ఆహ్వానితులందరూ తప్పకుండా హాజరుకావాలని ఆహ్వానం అందినట్టు సమాచారం.



# అమెరికాలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

కలిసేందుకు,భారత్-యుఎస్ఎ సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎదురుచూస్తున్నాను. ఇరు దేశల ప్రజల ప్రయోజనం కోసం, అత్యుత్తమ భవిష్యత్తు కోసం కలిసి పనిచేయనున్నాం' అని ప్రధాని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.అమెరికా చేరుకున్న ప్రధాని మోదీ అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసి గబ్బర్డ్‌ను కలుసుకున్నారు. అలాగే బ్లెయిర్ హౌస్ చేరుకున్న ప్రధాని ప్రవాస భారతీయులను కలుసుకున్నారు. ప్రధాని ఫిబ్రవరి 12-13 తేదీలలో అమెరికా పర్యటించనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశం కానున్నారు.ప్రధానిని స్వాగతించడానికి వాషింగ్టన్ డీసీకి తరలివచ్చిన ప్రవాస భారతీయులు ఆయనను చూడగానే 'వందేమాతరం','భారత్ మాతా కీ జై' నినాదాలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ అమెరికా పర్యటన జరుగుతోంది. అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలికారు.






# గూగుల్‌తో తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా ఏఐ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలపై దృష్టి సారిస్తుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ అభ్యసన పద్ధతులను ప్రారంభిస్తుంది. గూగుల్ వర్క్ స్పేస్, క్రోమ్ సర్వీసెస్ ను అందిస్తుంది. గూగుల్ డేటా కామన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఓపెన్ డేటా యాక్సెస్‌ను మెరుగుపరుస్తుంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతూ "ఏఐ ఆధారిత రంగాల్లో గ్లోబల్ లీడర్ గా ఉండాలన్న తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు గూగుల్ సహకారం ఎంతగానే ఉపయోగపడుతుంది. అత్యాధునిక ఏఐ టెక్నాలజీ ద్వారా కీలక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా ఎంచుకున్నాం. మెరుగైన పాలన, ఆర్థిక పురోగతితో పాటు ప్రజా సేవలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని అనుకున్నాం. ఈ లక్ష్య సాధనలో గూగుల్తో ఒప్పందం కీలకంగా నిలుస్తుంది" అని అన్నారు.

గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ కీలక రంగాలలో సహకారం అందించటం సంతోషంగా ఉందన్నారు. దేశ డిజిటల్ భవిష్యత్తు పట్ల తమ సంస్థ నిబద్ధతను ఈ నిర్ణయం బలోపేతం చేస్తుందని అన్నారు.

# ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణకు అన్యాయం జరగనివ్వం

(మొదటి పేజీ తరువాయి)



ఈనెల 19-21 వరకు నిర్వహిస్తున్న బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ యథాతథంగా ఉంటుందని తెలిపారు. సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వం వాదనలకు మద్దతుగా నిలిచిందని, రాష్ట్ర హక్కులను రక్షించడంలో ముందడుగు పడిందని స్పష్టం చేశారు. మంత్రితోపాటు రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, న్యాయవాదులు వైద్యనాథన్, గోపాల్ శంకర్ నారాయణ, అంతర్రాష్ట్ర నీటి వనరుల విభాగం అధికారులు, ఈఎన్సీ, తదితరులు హాజరయ్యారు.



# కుంభమేళలో సామాన్యుడిలా ఎంపీ ఈటల రాజేందర్

**ఈ-కబురు,ప్రయాగ్‌రాజ్**

ఫిబ్రవరి 13 : మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఈ రోజు తెల్లవారుజామున ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళలో పవిత్ర స్నానం చేశారు. జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌తో పాటు మరికొంతమంది తో కలిసి యూపీ వెళ్లిన ఈటల .. రాత్రి అక్కడే బస చేశారు. కుంభమేళలో ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ప్రొటోకాల్ ఉన్నప్పటికి.. అవన్ని కాదనుకొని.. సామాన్యుడిలా ప్రయాగ్ రాజ్‌కు చేరుకున్నారు. దాదాపు 10 కిలో మీటర్లు ప్రజలతో కాలినడకన త్రివేణి సంగమానికి చేరుకొని.. సంగంలో పవిత్ర స్నానం చేశారు. అలాగే త్రివేణి సంగమానికి పూజలు చేశారు. అనంతరం ఎంపీ ఈటలకు స్థానిక పూజారులు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు.కాగా దీనికి సంబంధించిన వీడియోను ఆయన అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియోలో ఎంపీ ఈటల , మాజీ ఎంపీ బీబీ పాటిల్ కలిసి ప్రజలతో పాటు నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది. కాగా జనవరి 13న ప్రయాగ్ రాజ్‌లో ఈ మహాకుంభమేళ ప్రారంభం అయింది. నాటి నుంచి నేటి వరకు దాదాపు 45 కోట్ల మంది ప్రజలు ఇప్పటికే సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఈ నెల 26న మహాశివ రాత్రి తో మహా కుంభమేళ ముగియనుంది. కాగా చివరి రోజు శివరాత్రి కావడంతో 5 కోట్ల మంది ప్రజలు పవిత్ర స్నానం ఆచరించే అవకాశం ఉందని.. ప్రభుత్వం అంచనా వేస్తుంది. ఈ మేరకు భారీ ఏర్పాట్లు చేస్తుంది.



# ఎలన్ మస్క్‌తో ప్రధాని మోడీ భేటీ..

## కీలక అంశాలపై డిస్కషన్ !

**ఈ-కబురు,వాషింగ్టన్ డీసీ**

ఫిబ్రవరి 13 : ఫ్రాన్స్ టూర్ అనంతరం రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ గురువారం అమెరికా చేరుకున్నారు. మోడీ యూఎస్ చేరుకోగానే అక్కడి భారతీయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తన షెడ్యూల్‌లో భాగంగా మోడీ బిజీ బిజీగా గడిపారు. మొదట అమెరికా నేషనల్ ఇంటలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్‌ను కలిసిన మోడీ ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, సైబర్ భద్రత, ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లపై పరస్పర సహకారాన్ని పెంచుకోవడంపై చర్చించారు. అనంతరం చారిత్రాత్మకమైన బ్లెయిర్ హౌస్‌లో టెస్లా సీఈఓ ఎలన్ మస్క్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆవిష్కరణలు, అంతరిక్ష అన్వేషణ, ఎలక్ట్రిక్ వాహనాలు, భారత్‌లోకి టెస్లా ఎంట్రీ, స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలు సహా పలు అంశాలపై డిస్కస్ చేశారు.భారత్‌లో టెస్లాను విస్తరించడానికి మస్క్ గతంలో ఆసక్తి చూపించాడు. ఈ నేపథ్యంలోనే ఇరువురి సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే భారతదేశంలో స్టార్‌లింక్ సేవలు త్వరలో ప్రారంభమవుతాయని పలువురు భావిస్తున్నారు. అనంతరం భారత సంతతికి చెందిన వ్యాపారవేత్త వివేక్ రామస్వామితో చర్చలు జరిపారు. అంతకుముందు ఆయన యూఎస్ జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్ట్‌తో సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌లో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, భారత ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ కూడా పాల్గొన్నారు. కాగా, భారత కాలమానం ప్రకారం ప్రధాని మోడీ గురువారం అర్ధరాత్రి 2:30 గంటలకు అధ్యక్షుడు ట్రంపుతో భేటీ కానున్నారు.



# అమెరికా నుంచి భారతీయుల బహిష్కరణ

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 13 : అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. కాగా.. ఇప్పటికే 104 మంది భారత్ కు చెందిన అక్రమవలసదారులను బహిష్కరించారు. అయితే, ప్రధాని నరేంద్రమోడీ అమెరికా పర్యటనలో ఉన్న వేళ ప్రస్తుతం మరో వార్త సంచలనంగా మారింది. అమెరికాలో సరైన పత్రాలు లేకుండా అక్రమంగా ఉంటున్న భారతీయ వలసదారులను మరోసారి బహిష్కరిస్తున్నట్లు ట్రంప్ సర్కారు ప్రకటించింది. రెండో విడత భారతీయులతో శనివారం(ఫిబ్రవరి 15)న మరో విమానం అమృత్‌సర్ వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే, ఫిబ్రవరి 05న 104 మంది భారతీయులను యూఎస్ మిలిటరీ విమానంలో అమృత్‌సర్‌కి తరలించారు.



# కేటీఆర్‌కి త్రైత సిద్ధాంత గ్రంథాలు అందజేత

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 13 : త్రిమత ఏకైక గురువు శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో హైదరాబాద్ లో గురువారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నాగర్ కర్నూల్ కమిటీ తరపున శాఖ సభ్యులు మంతటి వెంకటయ్య టీ.ఆర్.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌ని హైదారాబాద్ నంది నగర్‌లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన ప్రబోధ, సుబోధ , త్రైత సిద్ధాంత భగవద్గీత, అను 3 గ్రంథములు అందజేశారు. కేటి ఆర్ మాట్లాడుతూ ... మీ గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు తాడిపత్రి లో ప్రబోధాశ్రమం నెలకొల్పి భగవద్గీత ప్రచారం లో అనేక మంది హిందువులు ను పాల్గొనేటట్లు చేయడం చాలా గొప్ప విషయం., ఇలాంటి గొప్ప గురువుల వలననే సకాలం లో వర్షాలు దేవుడు కురిపిస్తున్నాడు మనం బాగున్నము అన్నారు

# మస్క్.. ట్రంప్‌కు కోటి డాలర్లు ఎందుకు ఇస్తానన్నాడు?

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 13 : అమెరికాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. గతంలో ఎక్స్(ట్విట్టర్)పై ట్రంప్ దావా వేసిన కారణంగా తాజాగా ఎలాన్ మస్క్ ఆయనకు దాదాపు 10 మిలియన్ డాలర్లు చెల్లించడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. 2021లో యూఎస్ క్యాపిటల్ భవనంపై దాడి అనంతరం ట్రంప్ ఈ దావా వేశారు.వివరాల ప్రకారం.. 2020లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ పరాజయం పాలయ్యారు. తర్వాత 2021 జనవరి 6న అమెరికా అధ్యక్షుడిగా బైడెన్ విజయాన్ని ధ్రువీకరించేందుకు వాషింగ్టన్ క్యాపిటల్ భవనంలో కాంగ్రెస్ సమావేశమైంది. అయితే ఆ సమావేశం జరగడానికి కొన్ని గంటల ముందు ట్రంప్ తన మద్దతుదారులను ఉద్దేశిస్తూ ప్రసంగించారు. అనంతరం ట్రంప్ మద్దతుదారులు వేలాదిగా క్యాపిటల్ భవనంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించారు. ఈ క్రమంలో అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని, బైడెన్ విజయాన్ని




ధ్రువీకరించకుండా కాంగ్రెస్‌ను ఆపేందుకే క్యాపిటల్ భవనంపై ట్రంప్ మద్దతుదారులు దాడికి పాల్పడ్డారని వాషింగ్టన్ ఫెడరల్ కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి. ఆ ఛార్జ్‌షీట్‌లో ట్రంప్ పేరు కూడా ఉంది.

ఈ నేపథ్యంలో ట్రంప్ సోషల్ మీడియా అకౌంట్స్‌ను ఎక్స్(ట్విట్టర్), ఫేస్‌బుక్.. ట్రంప్ అకౌంట్స్‌ను సస్పెండ్ చేసింది. దీంతో, వారి చర్యలను ఆయా సంస్థలపై ట్రంప్ దావా వేశారు. ఈ దావాను పరిష్కరించుకునేందుకు 25 మిలియన్ డాలర్లు చెల్లిస్తామని గత నెలలో మెటా ప్రకటించింది. ఇక, తాజాగా మస్క్(%జుశ్రీశీఅ వీబంఎ%) కూడా ట్రంప్‌కు 10 మిలియన్ డాలర్లు చెల్లించడానికి సిద్ధమైనట్టు వాల్ స్ట్రీట్ జర్నల్ చెప్పుకొచ్చింది.

ఇదిలా ఉండగా.. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలు కీలక నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. యూఎస్ క్యాపిటల్‌పై దాడి చేసిన తన మద్దతుదారులకు ఉపశమనం కల్పించారు. ఈమేరకు ఆయన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. ఈ ఘటనలో దాదాపు 1500 మందికి ట్రంప్ క్షమాభిక్ష కల్పించారు. వారిపై పెండింగ్‌లో ఉన్న కేసులు కొట్టివేయాలని అటార్నీ జర్నల్‌కు ఆదేశాలు జారీ చేశారు.

# పింక్ బుక్ మెయింటైన్ చేస్తున్నాం.. ఇంతకింత చెల్లిస్తాం

- లెక్కలు ఎలా రాయాలో మాకు తెలుసు... మీ లెక్కలు తీస్తాం
- మేం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి చెల్లిస్తాం
- కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది
- పార్టీ ఫిరాయించిన వారి స్థానాల్లో ఉప ఎన్నికలొస్తే ఎగిరేది గులాబీ జెండానే
- బీసీ బిల్లు తెచ్చి చేతులు దులుపుకుంటే కుదరదు
- బీసీ రిజర్వేషన్ పెంపు ఆచరణ సాధ్యంకావాలి
- విద్యా, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లకు వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టాలి
- జనగామ జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు


**అక్రమ కేసులతో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తుండడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. "మేము పింక్ బుక్ మెయింటైన్ చేస్తున్నాం. అందులో అన్నీ రాసుకుంటాం. ఇంతకింత తిరిగి చెల్లిస్తాం. లెక్కలు ఎలా రాయాలో మాకు తెలుసు. మీ లెక్కలన్నీ తీస్తాం. అన్నింటినీ మేం అధికారంలోకి వచ్చాక తిరిగి చెల్లిస్తాం" అని కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా హెచ్చరించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, కాంగ్రెస్ వేధింపులకు గులాబీ సైనికులు భయపడబోరని తేల్చిచెప్పారు.**



**ఈ-కబురు,జనగామ**

ఫిబ్రవరి 13 : గురువారం నాడు జనగామ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం టీ రాజయ్యతో కలిసి ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. అంతకు ముందు పెంబర్తిలోనూ విలేకరులతో మాట్లాడారు.కవిత మాట్లాడుతూ.. రైతు డిక్లరేషన్ పై నిలదీస్తారని రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో చిన్న విమర్శ చేసినా సీఎం రేవంత్ భయపడుతున్నారని, పోస్టు చేసిన మరుసటి నాడే ఇంటికి పోలీసులు వచ్చి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగాన్ని పట్టుకొని రాహుల్ గాంధీ తిరుగుతారని, కానీ తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా, మోసమని స్పష్టం చేశారు.బీసీ రిజర్వేషన్లను పెంచడానికి శాసన సభలో బిల్లు ప్రవేశపెడుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక డిమాండ్ చేశారు. బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే కుదరదని, దాన్ని ఆచరణ సాధ్యం అయ్యేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీలకు విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ల పెంపునకు ఒక్క బిల్లు కాకుండా మూడు వేర్వేరు బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీల జనాభా 46 శాతం ఉందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో విద్యా రంగంలో ఆ వర్గానికి 46 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు పెట్టాలని, ఉద్యోగాల్లో 46 శాతం రిజర్వేషన్లకు మరొక బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కాబట్టి ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరొక బిల్లును పెట్టాలని సూచించారు.బీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ జాగృతి, బీసీ సంఘాలు చేసిన ఉద్యమాలకు దిగొచ్చిన ప్రభుత్వం బీసీ బిల్లు పెడుతామని ప్రకటించిందని, ఇది బీసీలందరి విజయమని, ఇది తొలి విజయం మాత్రమేనని స్పష్టం చేశారు. అయితే, కాంగ్రెస్ ధోకేబాజ్ పార్టీ అని, మాటలు చెప్పి మోసం చేయడం ఆ పార్టీకి అలవాటు అని అన్నారు. బిల్లును ఆమోదించిన మరుసటినాడే దానికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేస్తేనే ఎన్నికల్లో రిజర్వేషన్లు సాధ్యమవుతాయని, కానీ జాప్యం చేసి ఇతరులు కోర్టుకు వెళ్లడానికి అవకాశం ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తున్నట్లు నిర్దిష్టమైన సమాచారం ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి ఎత్తుగడలు వేస్తే సహించబోమని, బీసీలంతా కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధిచెబుతారని హెచ్చిరంచారు. మళ్లీ కుల సర్వేకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, కానీ 15 రోజుల కాకుండా నెల రోజుల పాటు సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో 60 శాతం మంది తమ ఇళ్లకు సర్వే చేసే వారు రాలేదని అంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉందని చెప్పారు. ఈ రీత్యా రీ సర్వేపై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాలని, టోల్ ఫ్రీ నెంబరును విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పత్రికల్లో పెద్ద ఎత్తున ప్రకటనలు ఇవ్వాలని, ముఖ్యమంత్రి బొమ్మలు కాకుండా బీసీలకు ప్రయోజనం కలిగేలా ప్రచారం చేయాలని సూచన చేశారు.కేసీఆర్ హయాంలో గ్రామాల్లో నీళ్లు పారాయి.. నిధులు పారాయని, కానీ రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం గ్రామాలకు నీళ్లు, నిధులు రావడం లేదని తెలిపారు.

# 'ఆది వాణి' ఏఐతో భాష పదిలం



**దేశవ్యాప్తంగా గిరిజన తెగల భాషా వారసత్వాన్ని పెంపొందించడానికి , దాన్ని పరిరక్షించడానికి భారత ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతోంది. భాషాపరమైన అంతరాన్ని పూడ్చే ప్రయత్నంలో భాగంగా భిలి, ముండారి, సంతాలి, గోండితో సహా అనేక దేశీయ గిరిజన భాషల్లో అనువాదం, అభ్యాసం కోసం కృత్రిమ మేధ ఆధారిత అప్లికేషన్ 'ఆది వాణి'ని కేంద్రం ఆవిష్కరించనుంది.**

### సాంకేతికతతో సాధికారత

ఆది వాణిని అభివృద్ధి చేయడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి ప్రముఖ సంస్థల సాయం తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గిరిజన భాషల్లో ప్రత్యేకత కలిగిన భాషావేత్తలు, పరిశోధకుల సహకారం కోరినట్లు చెప్పాయి. అనువాదం, విద్యా ప్రయోజనాల కోసం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడేలా ఈ యాప్‌ను రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గిరిజన విద్యార్థులు వారి మాతృభాషలో చదువు నేర్చుకోవడానికి ఇది ఎంతో సహాయపడుతుందని చెప్పారు. అదే సమయంలో అంతరించిపోతున్న కొన్ని అరుదైన భాషలను కాపాడుకునేందుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు.

### భాష పరిరక్షణకు..

భారతదేశంలో 700కి పైగా విభిన్న గిరిజన సమాజాలున్నాయి. ప్రతి ఒక్కటి దాని సొంత ప్రత్యేకమైన భాష, మాండలికాలు, సంప్రదాయాలను కలిగి ఉంది. కారణాలు ఏవైనా ఈ భాషల్లో అనేకం అంతరించిపోతున్నాయి. కొన్ని తెగలు వారి భాషా గుర్తింపునే కోల్పోతున్నాయి. ఆది వాణితో ఈ సమస్యను కొంతవరకు పరిష్కరించే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. భాషలను పరిరక్షించడమే కాకుండా దైనందిన జీవితంలో దీన్ని చురుగ్గా ఉపయోగించే వాతావరణాన్ని సృష్టించాలని కేంద్రం భావిస్తోంది.

### విద్యార్థులకు ఎంతో మేలు..

ఆది వాణి యాప్‌లో గిరిజన భాషా అనువాదాలను అందించనున్నారు. దీని ద్వారా విద్యార్థులు ఏ భాషలో కంటెంట్ ఇచ్చినా అది తాము కోరుకున్న గిరిజన భాషలోకి మారుతుంది. తమ మాతృభాషలో పాఠ్యపుస్తకాలు, ఆడియో, విజువల్ కంటెంట్ పాఠాలను యాక్సెస్ చేసుకోవచ్చు. ఈ ప్రయత్నం వల్ల విద్యార్థులకు కష్టంగా ఉండే గణితం, సైన్స్, చరిత్ర వంటి సబ్జెక్టులను అర్థం చేసుకోవడానికి, అందులో రాణించడానికి వీలవుతుంది. దాంతోపాటు ఈ యాప్ ఉపాధ్యాయులకు విలువైన వనరుగా ఉంటుందని, భాషా అవసరాలను అర్థం చేసుకోవడానికి, తదనుగుణంగా బోధనా పద్ధతులను మార్చుకోవడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు.



## మళ్ళీ పెరిగిన బంగారం ధరలు: ఇక కొనుగోలు కష్టమే!

వారం రోజుల తరువాత గోల్డ్ రేటు తగ్గింది అనుకునే లోపలే.. మళ్ళీ పెరిగింది. దీంతో మళ్ళీ బంగారం ధరలలో కదలికలు ఏర్పడ్డాయి. నేడు (గురువారం) తులం పసిడి ధర గరిష్టంగా రూ. 87050 వద్ద ఉంది. దేశంలోని ప్రధాన నగరాల్లో గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయనే వివరాలు ఈ కథనంలో చూసేద్దాం.

హైదరాబాద్, విజయవాడలలో మాత్రమే కాకుండా గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు వంటి ప్రాంతాల్లో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 79,800 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 87,050 వద్ద నిలిచాయి. నిన్న రూ. 700, రూ. 710 తగ్గినా గోల్డ్ రేటు.. ఈ రోజు మళ్ళీ రూ. 400 (22 క్యారెట్స్ 10గ్రా), రూ. 380 (24 క్యారెట్స్ 10గ్రా) పెరిగింది.

చెన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ. 400, రూ. 380 పెరిగింది. దీంతో ఇక్కడ 10గ్రా 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 79,800 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 87,050 వద్ద ఉంది. చెన్నైలో కూడా నిన్న పసిడి ధరలు తగ్గుదలను నమోదు చేశాయి.

దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు రూ. 79,950 (10గ్రా 22 క్యారెట్స్), రూ. 87,200 (10గ్రా 24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 400, రూ. 310 ఎక్కువ. అంతే కాకుండా.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఢిల్లీలో గోల్డ్ రేటు కొంత ఎక్కువగానే ఉంది.

### వెండి ధరలు ...

బంగారం ధరలు పెరుగుతున్నప్పటికీ.. వెండి రేటు మాత్రం ఎనిమిదో రోజు స్థిరంగానే ఉంది. దీంతో ఈ రోజు (12 ఫిబ్రవరి) కేజీ సిల్వర్ రేటు రూ. 1,07,000లకు చేరుకుంది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు లక్ష రూపాయలు దాటేసినప్పటికీ.. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి రేటు రూ. 99,500 వద్ద ఉంది.

## పండుగైన బ్యాంకులు పనిచేయాల్సిందే: ఆర్‌బీఐ

ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ.. అన్ని బ్యాంకులు పనిచేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు కాబట్టి.. అన్ని లావాదేవాలను అదే రోజు నమోదయ్యేలా చూసేందుకు సెలవు రద్దు చేయడం జరిగింది. 2025 ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుంది. కాబట్టి అప్పటికే పన్ను చెల్లింపులు (ఆదాయపు పన్ను, జీఎస్టీ, కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు), పెన్షన్ చెల్లింపులు, ప్రభుత్వ సబ్సిడీలు, ప్రభుత్వ జీతభత్యాల చెల్లింపు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రజా లావాదేవీలను ముగించాల్సి ఉంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది.

నిజానికి మార్చి 31 రంజాన్ పండుగ, ఈ కారణంగానే.. దేశంలోని అన్ని బ్యాంకులకు సెలవు. ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో ఆ రోజు బ్యాంకులన్నీ పనిచేయాలని.. ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన అన్ని పనులను పూర్తి చేయాలనీ ఆర్‌బీఐ ఆదేశించింది. అంతే కాకుండా ఏప్రిల్ 1న సెలవు దినంగా ప్రకటించింది. ఆన్‌లైన్ సేవలు అన్ని సెలవు దినాల్లో కూడా అందుబాటులో ఉంటాయి. కాబట్టి ఆన్‌లైన్ లావాదేవీలకు ఎలాంటి ఆటంకం ఉండదు.

# భారీగా తగ్గిన ధరలు



## ఐఫోన్ కొనడానికి ఇదే మంచి సమయం

ప్రేమికుల రోజును పురస్కరించుకుని ఫ్లిప్‌కార్ట్ తన 'వాలెంటైన్స్ డే సేల్ 2025'ని ప్రారంభించింది. ఇందులో యాపిల్ ఐఫోన్‌ల మీద గొప్ప డిస్కౌంట్స్ ప్రకటించింది. ఫిబ్రవరి 7 నుంచి మొదలైన ఈ సేల్స్ 14 వరకు కొనసాగుతుంది.

ఫ్లిప్‌కార్ట్ వాలెంటైన్స్ డే సేల్ 2025లో.. డిస్కౌంట్స్ లభిస్తున్న ఐఫోన్‌లలో.. ఐఫోన్ 16, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 15, ఐఫోన్ 15 ప్లస్, ఐఫోన్ 14 వంటివి ఉన్నాయి.

ఐఫోన్ 16 ప్లస్ ఇప్పుడు రూ. 11,000 తగ్గింపుతో.. రూ. 78,999 వద్ద లభిస్తుంది. ఇది కాకుండా బ్యాంక్ ఆఫ్ బరోడా క్రెడిట్ కార్డ్ హోల్డర్లు రూ. 5,000 అదనపు తగ్గింపును కూడా పొందవచ్చు. అంటే రూ. 74000కు లభిస్తుంది. పాత ఫోన్ ఎక్స్ఛేంజ్ చేయడం ద్వారా ఇంకా తగ్గింపు లభిస్తుంది.



ఐఫోన్ 15 ధర రూ.64,999 నుంచి ప్రారంభమవుతుంది.. ఐఫోన్ 15 ప్లస్ రూ.68,999 కు లభిస్తుంది. ఐఫోన్ 14 మోడల్ రూ.53,999 ధరకు లభిస్తుంది. కేవలం ఫ్లిప్‌కార్ట్ మాత్రమే కాకుండా.. వివిధ ఈ కామర్స్ వెబ్‌సైట్‌లు కూడా కొన్ని ప్రత్యేకమైన ఉత్పత్తుల మీద మంచి ఆఫర్స్ అందిస్తాయి. ఇందులో కేవలం మొబైల్ ఫోన్స్ మాత్రమే కాకుండా.. ఇతర ఎలక్ట్రానిక్స్, బట్టలు, ఇతర వస్తువులు ఉంటాయి.

## ఎక్కువ స్టోరేజ్.. ఉత్తమ ఫీచర్స్: బెస్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్స్ ఇవే..

ఇండియన్ మార్కెట్లో.. తక్కువ ధర, ఎక్కువ రేంజ్, మంచి డిజైన్, లేటెస్ట్ ఫీచర్స్ ఉన్న స్కూటర్లను మాత్రమే కాకుండా, అండర్ సీట్ స్టోరేజ్ ఎక్కువ ఉన్న స్కూటర్లను కొనుగోలు చేయడానికి కూడా ఆసక్తి

### ఏథర్ రిజ్టా

ఎక్కువ అండర్ సీట్ స్టోరేజ్ కలిగిన ఎలక్ట్రిక్ స్కూటర్ల జాబితాలో ఏథర్ రిజ్టా ఒకటి. దీని ధర రూ. 1.11 లక్షల నుంచి రూ. 1.47 లక్షల మధ్య ఉంది. ఈ స్కూటర్ అండర్ సీట్ స్టోరేజ్ 34 లీటర్లు. ఇందులో ఒక ఫుల్ హెల్మెట్, ఇతర వస్తువులను ఉంచవచ్చు. మంచి డిజైన్ కలిగిన ఈ స్కూటర్.. మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది.

### రివర్ ఇండీ

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఇతర స్కూటర్ల కంటే ఇది చాలా భిన్నంగా ఉంటుంది. ఈ స్కూటర్ అండర్ సీట్ స్టోరేజ్ ఏకంగా 43 లీటర్లు. కాబట్టి రెండు హెల్మెట్స్ సులభంగా ఉంచవచ్చు. ఇది కాకుండా అదనపు



బాక్సులను అటాచ్ చేయడానికి రెండు వైపులా అల్లాయ్ పన్నీర్ మౌంట్‌లు ఇందులో ఉన్నాయి. దీని ధర రూ. 1.43 లక్షలు.

### బజాజ్ చేతక్

35 లీటర్ల అండర్ సీట్ కలిగిన ఈ బజాజ్ చేతక్ కూడా.. ఎక్కువ అండర్ సీట్ స్టోరేజ్ కలిగిన ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఒకటి. ఎక్కువ స్టోరేజ్ కోసం కంపెనీ బ్యాటరీని ఫ్లోర్‌బోర్డ్‌లో ఫిక్స్ చేసింది. సరికొత్త డిజైన్ కలిగిన ఈ స్కూటర్.. ఉత్తమ ఫీచర్స్ పొందుతుంది. దీని ధర రూ. 1.20 లక్షల నుంచి ప్రారంభమవుతుంది.

### ఓలా ఎస్1 ప్రో ప్లస్ జెన్ 3

ఓలా ఎస్1 ప్రో ప్లస్ జెన్ 3 ఎలక్ట్రిక్ స్కూటర్ 34 లీటర్ల అండర్ సీట్ స్టోరేజ్ పొందుతుంది. చూడటానికి స్టాండర్డ్ మోడల్ మాదిరిగా ఉన్నప్పటికీ.. స్టోరేజ్ కెపాసిటీ ఇతర ఓలా స్కూటర్ల కంటే ఎక్కువ అందిస్తుంది. దీని ధర రూ. 1.55 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఇది ఒక సింగిల్ ఛార్జితో 300 కిమీ కంటే ఎక్కువ రేంజ్ అందిస్తుంది.

### టీవీఎస్ ఐక్యూబ్

మార్కెట్లో అత్యధిక అమ్మకాలు పొందుతున్న ఐక్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్ 32 లీటర్ అండర్ సీట్ స్టోరేజ్ పొందుతుంది. ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ. 1.26 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఇది ఒక సింగిల్ ఛార్జితో గరిష్టంగా 150 కిమీ రేంజ్ అందిస్తుంది. డిజైన్, ఫీచర్స్ పరంగా ఇది చాలా ఉత్తమంగా ఉంటుంది.

### రెండుసార్లు బ్రేకప్, ఇద్దరూ నాపై చేతులెత్తేవారే..



# తెలుగులో అవకాశాలు రావట్లేదు!

సంక్రాంతికి వస్తున్నాం సినిమా తో ఈ ఏడాదికి శుభారంభం పలికింది తెలుగమ్మాయి ఐశ్వర్య రాజేశ్ . అయితే ఈ విజయం అంత ఈజీగా రాలేదు. ఎన్నో విమర్శలను దాటుకుని ఈ సక్సెస్‌ను అందుకుంది. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత, వృత్తిపర విషయాల్ని పంచుకుంది. ఐశ్వర్య రాజేశ్ మాట్లాడుతూ.. మా నాన్న రాజేశ్ చిన్నప్పుడే చనిపోయారు. అప్పుడు నాకు ఎనిమిదేళ్లనుకుంటాను.



**ఖరీదైన బహుమతి...** ముగ్గురు అన్నల తర్వాత నేను పుట్టాను. మా నలుగుర్ని మా అమ్మ ఒక్కరే కష్టపడి పెంచింది. రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా భూములమ్మేది. ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా పని చేసింది. ఇంటింటికీ వెళ్లి చీరలమ్మేది. మమ్మల్ని చదివించడం కోసం చాలా కష్టపడింది. తనను ఎంతో అపురూపంగా చూసుకుంటాను. తనకు ఎప్పుడూ ఏదో ఒక బహుమతి ఇస్తూ ఉంటాను. ఇటీవలే అమ్మ చేసిన రుచికరమైన చేపల పులుసుకుగానూ రూ.18 లక్షల విలువైన గాజులు బహుమతిగా ఇచ్చాను.

**సినిమా..** తెలుగులో సినిమా చేస్తే మంచి కథతో, మంచి హీరోతో చేయాలనుకున్నాను. అలా వరల్డ్ ఫేమస్ లవర్ చేశాను. సినిమా అంతగా ఆడకపోయినా నేను పోషించిన సువర్ణ పాత్ర చాలామందికి నచ్చింది. నేను నేచురల్‌గా ఉండేందుకే ఇష్టపడతాను. సౌకర్యంగా అనిపించని దుస్తుల్ని ధరించను. అలాగే నాకు సెట్టవని పాత్రలు కూడా చేయను.

**రెండుసార్లు బ్రేకప్.. నేను చాలా ఎమోషనల్ పర్సన్‌ను. గతంలో రిలేషన్‌షిప్‌లో చాలా బాధల్ని అనుభవించాను. నేను ప్రేమించిన వ్యక్తి నన్ను వేధింపులకు గురి చేశాడు. అతడితో బ్రేకప్ అయ్యాక మళ్లీ అదే నరకంలో అడుగుపెట్టాను. రెండోసారి ప్రేమించిన వ్యక్తి కూడా నన్ను వేధించాడు. ఆ వేధింపులు ఎంతలా ఉండేవంటే.. చేతులెత్తి నన్ను కొట్టేవారు. నేనెంతగానో ప్రేమిస్తే ఇలా జరుగుతుందేంటని బాధపడ్డాను. రెండు రిలేషన్‌షిప్స్‌లో వేధింపులు అనుభవించడంతో మళ్లీ ప్రేమలో పడాలంటేనే భయమేస్తోంది.**

అవకాశాలు రావట్లేదు .. ఎందుకంటే ఒకరికి కనెక్ట్ అయ్యాక.. వారి నుంచి దూరం కావడానికి నాకు కనీసం ఏడాదైనా పడుతుంది. అందుకే ఇంకొకరిని లవ్ చేయాలంటేనే భయంగా ఉంది. ఇకపోతే పెళ్లెప్పుడనేది ఇప్పుడే చెప్పలేను.





# నన్ను తొక్కాలని, నలపాలని చూస్తారా? మీ వల్ల కాదు

నన్ను ఎంతోమంది తొక్కాలని చూస్తున్నారు. మీరేం చేసినా ప్రజల గుండెల్లో నుంచి నన్ను తీయలేరు అంటున్నాడు హీరో మంచు మనోజ్ . తనను తొక్కాలన్నా, లేపాలన్నా అది అభిమానుల వల్లే అవుతుందన్నాడు. భరత్ హీరోగా పరిచయమవుతున్న జగన్నాథ్ సినిమా టీజర్‌ను మంచు మనోజ్ గురువారం రిలీజ్ చేశాడు.

## నన్ను తొక్కాలని చూసినా..


అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో జరిగిన ఈ టీజర్ లాంచ్ కార్యక్రమంలో మనోజ్ మాట్లాడుతూ.. నాకు జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా, ఎంత మంది తొక్కాలని చూసినా, బురద జల్లాలని చూసినా.. ఆ నాలుగు గోడల మధ్యకు నన్ను రానీయకపోయినా, నన్ను ఏం చేసినా సరే.. ప్రజల గుండెల్లో నుంచి మాత్రం నన్ను తీయలేరు. మీరే నా దేవుళ్లు, మీరే నా కుటుంబం, మీరే నాకు అన్నీ..!

## ఎవరి వల్లా సాధ్యం కాదు

చెట్టుపేరో, జాతి పేరో చెప్పుకుని మార్కెట్‌లో అమ్ముడుపోవడానికి నేను కాయో, పండో కాదు.. మీ మనోజ్‌ను. మనోజ్‌ను తొక్కుదామని చూస్తారా? నలుపుదామని చూస్తారా? నన్ను తొక్కాలన్నా, లేపాలన్నా అది అభిమానుల వల్ల మాత్రమే అవుతుంది. ఈ ప్రపంచంలో ఇంకెవరి వల్లా కాదు.

## ఎంతదూరమైనా వెళ్తా..

ఓ మంచి కోసం నిలబడ్డప్పుడు న్యాయం జరిగేవరకు దాన్ని వదిలిపెట్టేది లేదు. అది బయటవాళ్లైనా సరే, నా వాళ్లయినా సరే.. న్యాయం కోసం ఎంతదూరమైనా వెళ్తాను. నేను విద్యార్థుల కోసం నిలబడ్డాను. నా ప్రాణం ఉన్నంతవరకు నిబలడతాను. ఈ రోజే కాదు, ఎప్పటికీ ఎవరూ నన్ను ఆపలేరు అని మనోజ్ చెప్పుకొచ్చాడు.



# ప్రభాస్‌తో కలిసి నటించాలనుకుంటున్నారా?..

# ● ఇదే గోల్డెన్ చాన్స్!

ప్రభాస్‌ని చూస్తే చాలు అనుకునేవాళ్లు చాలా మంది ఉన్నారు. ఆయనతో ఒక సెల్ఫీ దిగితే చాలు.. ఇంకేం వద్దు అనుకునే ఫ్యాన్స్ కూడా ఉన్నారు. అలాంటిది ప్రభాస్‌తో కలిసి నటించే చాన్స్ వస్తుందంటే.. ఎవరైనా ఊరుకుంటారా? అసలు అలాంటి అవకాశం వస్తుందని కూడా ఊహించరు కదా? ఇప్పుడు అలాంటి గొప్ప అవకాశాన్ని కల్పించేందుకు ముందుకు వచ్చింది స్పిరిట్' యూనిట్. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'యానిమల్"ఫేం సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ను మార్చ్ లో ప్రారంభించాలని యూనిట్ ప్లాన్ చేస్తోందని సమాచారం. ప్రభాస్ తన కెరీర్ తొలిసారిగా పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్, ఆలియా భట్, రష్మికా మందన్నా.. తదితర స్టార్ హీరోయిన్ ల పేర్లు తెరపైకి వస్తున్నాయి. అయితే.. వారితో ఎవరూ కూడా ఫైనలైజ్ కాలేదట.

**ఇదిలా ఉంటే..** ఈ సినిమా లో కలిసి నటించే సువార్ణావకాశాన్ని కల్పించింది నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్. 'స్పిరిట్' కోసం నటీనటులు కావాలంటూ సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. వయసుతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్న పురుషులు, స్త్రీలు అంతా తమ ప్రొఫైల్ పంపించాల్సిందిగా కోరింది. అయితే ఇక్కడ ఓ చిన్న కండీషన్ కూడా పెట్టింది. గతంలో ఫిలిం లేదా థియేటర్ బ్యాగ్రౌండ్ ఉన్నవాళ్లు మాత్రమే ఇందుకు అర్హులని ప్రకటించింది.

అయితే ఇందుకు 2 ఫొటోలు, 2 నిమిషాల వీడియో రికార్డ్ ప్రకటించారు. ఆసక్తి గలవారు ఓ వీడియో రికార్డ్ చేసి, ఈ ఈమెయిల్ కు పంపించాలని ప్రకటించారు. ఈ మేరకు 'కాస్టింగ్ కాల్' అంటూ సోషల్ మీడియాలో ఓ పోస్టర్ షేర్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టు నెట్టింట్లో వైరల్ గా మారింది. కాగా, ప్రభాస్ ప్రస్తుతం ఫౌజీ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో కనిపించనున్నారు.ఈ సినిమా పూర్తి అయినా తరువాత స్పిరిట్‌సినిమా షూటింగ్ లో పాల్గొన అవకాశముంది.

# పుష్ప 2 గ్రాండ్ సక్సెస్... వ్రతం చేసుకున్న సుకుమార్ దంపతులు

ఆర్య సినిమాతో దర్శకుడిగా పరిచయమైన సుకుమార్ రెండు దశాబ్దాల కాలంలో పట్టుమని పది సినిమాలు కూడా తీయలేదు. తక్కువ సినిమాలతోనే ఎక్కువ పేరు సంపాదించుకున్నాడు. ఆర్య 2, 100% లవ్, నాన్నకు ప్రేమతో, రంగస్థలం ఇలా దేనికవే భిన్నమైన కథలు రాసుకుంటూ ప్రేక్షకుల్ని అలరించాడు. బాక్సాఫీస్ హిట్లు అందుకున్నాడు. పుష్ప చిత్రంతో పాన్ ఇండియా ప్రజల్ని ఆకట్టుకున్నాడు. మూడేళ్ల తర్వాత దీనికి సీక్వెల్‌గా వచ్చిన పుష్ప 2: ద రూల్ అంతకుమించి ఘన విజయాన్ని సాధించింది.

ఈ భారీ సక్సెస్ తర్వాత సుకుమార్ భార్య తబిత తో కలిసి ఇంట్లో వ్రతం చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఫోటోలను తబిత సోషల్ మీడియాలో షేర్ చేసింది. అందులో ఆమె పట్టు చీర కట్టి, నిండుగా ఆభరణాలు ధరించి, నుదుటన సింధూరం పెట్టి, ముక్కుకు ముక్కెర పెట్టి అందంగా ముస్తాబైంది. సుకుమార్ పంచెకట్టులో కనిపించాడు. ఈ జంటను చూసిన అభిమానులు వీరిని పుష్ప, శ్రీవల్లి అని అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం సుకుమార్.. రామ్‌చరణ్‌తో సినిమా(ఛ%=జ%17) చేస్తున్నాడు.



# అన్నీ కొత్త ముఖాలే..

# అయినా ఓటీటీలో ట్రెండింగ్‌లో వెబ్‌సిరీస్.. త్వరలోనే పార్ట్ 2

ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన కోబలి వెబ్ సిరీస్‌కు ఓటీటీలో మంచి ఆదరణ లభించింది. రవి ప్రకాష్, రాకీ సింగ్ ప్రధాన పాత్రలు పోషించగా.. తరుణ్ రోహిత్, శ్రీతేజ్, శ్యామల, యోగి ఖత్రి, శ్రీ పవన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. రేవంత్ లేవాక దర్శకత్వం వహించారు. 'నింబస్ ఫిలిమ్స్', 'యు1 ప్రొడక్షన్స్', 'టి.ఎస్.ఆర్ మూవీ మేకర్స్' సంస్థలపై జ్యోతి మెగావత్ రాథోడ్, రాజశేఖర్ రెడ్డి కామిరెడ్డి, తిరుపతి శ్రీనివాసరావు సంయుక్తంగా నిర్మించారు.

ఫిబ్రవరి 4న హాట్‌స్టార్‌లో రిలీజైన ఈ సిరీస్ ఏడు భాషల్లో స్ట్రీమ్ అవుతోంది. ఇప్పటికీ నెంబర్ వన్ ప్లేస్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ సందర్భంగా గురువారం నాడు కోబలి సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నటుడు రవి ప్రకాష్ మాట్లాడుతూ.. "నేను ఇండస్ట్రీకి వచ్చి 20 ఏళ్ళయింది. కొత్తగా ఏదో ఒకటి చేయాలనే తపనతో 'కోబలి' మొదలుపెట్టాను. ఒక కాఫీ షాప్లో ఈ కథ విన్నాను. నచ్చింది. కానీ ఇది ముందుకు వెళ్తుందనే నమ్మకం కలగలేదు.

ఎందుకంటే అంతా కొత్తవాళ్లే. ఈ కంటెంట్‌లో అమ్ముడు పోయే ముఖం ఒక్కటి కూడా లేదు. అయినప్పటికీ ఈ సిరీస్‌ను ప్రేక్షకులు ఆదరించారు. నిజాయితీగా పనిచేస్తే ఫలితం తప్పకుండా వస్తుందని నిరూపించారు" అంటూ చెప్పుకొచ్చారు. రాకీ సింగ్ మాట్లాడుతూ.. "చిన్న పాత్ర అయినా చేయడానికి ముందుకు వచ్చిన వెంకట్ గారికి థాంక్స్. కానీ సీజన్ 2 లో ఆయన పాత్ర ఎక్కువగా ఉంటుంది. అసలైన కథ అక్కడ మొదలవుతుంది. ఇది జస్ట్ ట్రైలరే" అన్నారు.



# ఛాంపియన్స్ ట్రోఫీ వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల

ఛాంపియన్స్ ట్రోఫీ వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ఐసీసీ ఇవాళ (ఫిబ్రవరి 13) ప్రకటించింది. ఫిబ్రవరి 14 నుంచి 17 తేదీల మధ్యలో ఈ వార్మప్ మ్యాచ్‌లు జరుగుతాయి. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్ మాత్రమే ఈ వార్మప్ మ్యాచ్‌లు ఆడుతున్నాయి. బిజీ షెడ్యూల్ దృష్ట్యా భారత్ వార్మప్ మ్యాచ్‌లు ఆడటం లేదు. ఈ వార్మప్ మ్యాచ్‌ల కోసం పాకిస్తాన్ మూడు టీమ్‌లను ప్రకటించింది.

ఫిబ్రవరి 14న జరిగే మ్యాచ్‌లో షాదాబ్ ఖాన్ నేతృత్వంలోనే పాకిస్తాన్ షహీన్స్ ఆఫ్ఘనిస్తాన్‌ను ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్ లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరుగనుంది. ఫిబ్రవరి 16న జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు తలపడతాయి. ఈ మ్యాచ్ కరాచీలోని నేషనల్ స్టేడియంలో జరుగుతుంది.

ఫిబ్రవరి 17న కరాచీలో జరిగే మ్యాచ్‌లో ముహమ్మద్ హురైరా నేతృత్వంలోని పాకిస్తాన్ షాహీన్స్ సౌతాఫ్రికాతో తలపడుతుంది. అదే రోజు దుబాయ్‌లో జరిగే మ్యాచ్‌లో మొహమ్మద్ హరీస్ సారథ్యంలోని పాకిస్తాన్ షాహీన్స్ న్యూజిలాండ్‌ను ఎదుర్కొంటుంది. ఈ నాలుగు వార్మప్ మ్యాచ్‌లు డే అండ్ నైట్ ఫార్మాట్‌లో జరుగుతాయి.




ఛాంపియన్స్ ట్రోఫీ అసలు మ్యాచ్‌లు ఫిబ్రవరి 19న మొదలవుతాయి. ఈ మెగా టోర్నీ పాకిస్తాన్, దుబాయ్ వేదికలుగా జరుగనుంది. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో జరుగనుండగా.. మిగతా మ్యాచ్‌లన్నీ పాకిస్తాన్‌లో జరుగుతాయి. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్లు తలపడతాయి.

ఫిబ్రవరి 20న జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్.. భారత్‌ను ఢీకొంటుంది. ఫిబ్రవరి 23న భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరుగతుంది. ఈ టోర్నీలో భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు గ్రూప్-ఏలో ఉండగా.. గ్రూప్-బిలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ జట్లు పోటీపడుతున్నాయి.

## వార్మప్ మ్యాచ్‌ల కోసం పాకిస్తాన్ షాహీన్స్ జట్లు:

%జ% ఆఫ్ఘనిస్తాన్, గడ్డాఫీ స్టేడియం, లాహోర్ - షాదాబ్ ఖాన్ (కెప్టెన్), అబ్దుల్ ఫసీ, అరాఫత్ మిన్హాస్, హుస్సేన్ తలత్, జహందాద్ ఖాన్, కాషిఫ్ అలీ, మొహ్సిన్ రియాజ్, మహ్మద్ అబ్బాస్ అఫ్రిది, మహ్మద్ అమీర్ ఖాన్, ముహమ్మద్ అఖ్లక్, ముహమ్మద్ ఇమ్రాన్ రంధవా, ముహమ్మద్ ఇర్ఫాన్ ఖాన్

%జ% దక్షిణాఫ్రికా, నేషనల్ స్టేడియం, కరాచీ - మొహమ్మద్ హురైరా (కెప్టెన్), అమద్ బట్, ఫైసల్ అక్రమ్, హసన్ నవాజ్, ఇమామ్-ఉల్-హక్, ఖుర్రం షెహజాద్, మాజ్ సదాకత్, మెహ్రాన్ ముంతాజ్, ముహమ్మద్ ఘాజీ ఘోరీ, నియాజ్ ఖాన్, ఖాసిం అక్రమ్, సాద్ ఖాన్

%జ% బంగ్లాదేశ్, %×జజ% అకాడమీ, దుబాయ్ - మొహమ్మద్ హారిస్ (కెప్టెన్), అమీర్ జమాల్, అబ్దుల్ సమద్, అలీ రజా, అజాన్ అవైస్, మహ్మద్ వసీమ్ జూనియర్, ముబాసిర్ ఖాన్, మూసా ఖాన్, ఒమైర్ బిన్ యూసుఫ్, సాహిబ్జాదా ఫర్హాన్, సుఫియాన్ మొకిమ్, ఉసామా మీర్.



# టోర్నీ ఆరంభానికి ముందే ఆర్సీబీకి భారీ షాక్!

మహిళల ప్రీమియర్ లీగ్2025 ఆరంభానికి ముందే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వుమెన్స్ జట్టుకు భారీ షాక్ తగిలింది. ఇప్పటికే పలువురు ప్లేయర్లు గాయాల వల్ల ఈ టోర్నమెంట్‌కు దూరం కాగా.. తాజాగా స్టార్ స్పిన్నర్ ఆశా శోభన కూడా తప్పుకొంది.

స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ నుర్ఝుత్ పర్వీన్ ఈ సీజన్‌లో ఆశా శోభన స్థానాన్ని భర్తీ చేస్తుంది. నుర్ఝుత్ ఆర్సీబీకిలో నీకు స్వాగతం" ఆర్సీబీ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది.

కాగా 33 ఏళ్ల లెగ్ స్పిన్నర్ ఆశా శోభన మహిళల టీ20 ప్రపంచకప్-2024 సందర్భంగా చివరగా భారత్‌కు ప్రాతినిథ్యం వహించింది. నాడు గ్రూప్ దశలో భాగంగా ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో ఆమె గాయపడింది. అయితే, ఇంత వరకు కోలుకోలేదు. ఈ నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ తాజా ఎడిషన్ మొత్తానికి ఆమె దూరమైంది.

గత సీజన్‌లో ఆశా శోభన మొత్తంగా పన్నెండు వికెట్లు తీసి జట్టు చాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించింది. ఇక ఇదివరకే సోఫీ మెలినెక్స్, కేట్ క్రాస్ గాయాల కారణంగా ఆర్సీబీకి దూరం కాగా.. సోఫీ డివైన్ టోర్నీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకుంది.

మరోవైపు.. ఆల్‌రౌండర్ శ్రేయాంక పాటిల్ కూడా గాయం వల్ల స్వదేశంలో పలు సిరీస్‌లకు దూరమైన విషయం తెలిసిందే. కాబట్టి ఆమె ఆర్సీబీ తుదిజట్టులోకి వస్తుందా లేదా అన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది.

ముంబై ఇండియన్స్‌లోకి పరుణిక సిసోడియా

డబ్ల్యూపీఎల్ ఆరంభానికి ముందు ముంబై ఇండియన్స్‌కు కూడా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ పూజా వస్త్రాకర్ సీజన్ మొత్తానికి దూరమైంది. ఆమె స్థానంలో పరుణిక సిసోడియా జట్టులోకి వచ్చింది. కనీస ధర రూ. 10 లక్షలతో పరుణిక ముంబై ఇండియన్స్‌లో చేరింది.

కాగా ఇటీవల జరిగిన మహిళల అండర్-19 వరల్డ్‌కప్ టోర్నీలో పరుణిక అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ నుంచి ఆమెకు పిలుపు రావడం గమనార్హం. ఇక ఫిబ్రవరి 14- మార్చి 15 వరకు మహిళల ప్రీమియర్ లీగ్ జరుగనుంది. ముంబై ఇండియన్స్ వుమెన్స్, ఆర్సీబీ వుమెన్స్, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య మొత్తంగా 22 మ్యాచ్‌లు జరుగుతాయి.

**ఈ నేపథ్యంలో ఆశా శోభన స్థానాన్ని భారత వికెట్ కీపర్ బ్యాటర్ నుర్ఝుత్ పర్వీన్‌తో భర్తీ చేస్తున్నట్లు ఆర్సీబీ గురువారం ప్రకటన విడుదల చేసింది. "దురదృష్టవశాత్తూ.. మోకాలి గాయం కారణంగా మా చాంపియన్ ఆల్‌రౌండర్ ఆశా శోభనడబ్ల్యూపీఎల్-2025 మొత్తానికి దూరమైంది.**

# చెస్ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి సంచలన వ్యాఖ్యలు



యువ ఆటగాళ్లు కెరీర్‌లో ఎదిగేందుకు ప్రోత్సాహకంగా ఇప్పటి వరకు అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని ఆపి వేయాలని ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై అంతర్జాతీయ ఈవెంట్లలో విజయాలు సాధిస్తేనే నగదు పురస్కారాలు లభిస్తాయి. చెస్‌లో గ్రాండ్‌మాస్టర్‌గా (జీఎం) మారితే రూ. 4 లక్షలు, ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) సాధిస్తే రూ.1.5 లక్షలు ఇచ్చేవారు. అయితే వీటిని నిలిపివేయడం సరైన నిర్ణయం కాదని అగ్రశ్రేణి ఆటగాడు అర్జున్ ఇరిగేశి అభిప్రాయపడ్డాడు.

'చెస్‌లో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న వర్ధమాన ఆటగాళ్లకు ఈ సమస్య అర్థం కాకపోవచ్చు. కానీ వారిని ప్రోత్సహించే తల్లిదండ్రులకు మాత్రం ఈ నిర్ణయం తీవ్ర నిరాశ కలిగిస్తుంది. దీని వల్ల వారికి ఆర్థికపరమైన సమస్యలు వస్తాయి. డబ్బుల కోసం ప్రత్యామ్నాయాలు చూడాల్సి వస్తుంది. పిల్లలను ప్రోత్సహించాలనే ప్రేరణ తగ్గిపోతుంది. సరిగ్గా చెప్పాలంటే చెస్, చదువులో ఏదైనా ఎంచుకోవాల్సి వస్తే వారు ఆటను పక్కన పెట్టవచ్చు' అని అర్జున్ వ్యాఖ్యానించాడు.

# మకావును మట్టికరిపించి...

## క్వార్టర్ ఫైనల్లో భారత్

ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు భారీ విజయంతో బోణీ కొట్టింది. మకావు జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 5%-%0 తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో భారత జట్టుకు క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారైంది. మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియా చేతిలో ఓడిన మకావు జట్టు వరుసగా రెండో ఓటమితో లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. ఇప్పటికే క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన దక్షిణ కొరియా నేడు భారత జట్టుతో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో



గెలిచిన జట్టు గ్రూప్ 'డి' టాపర్‌గా నిలుస్తుంది. తొలి మ్యాచ్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్%-%ఆద్యా వరియత్ జోడీ 21%-10, 21-%9తో లోక్ చోంగ్ లియోంగ్%-%వెంగ్ చి ఎన్జీ జంటను ఓడించి భారత్‌కు 1%-%0 ఆధిక్యాన్ని అందించింది. రెండో మ్యాచ్‌లో లక్ష్య సేన్ 21%-16, 21-%12తో పాంగ్ ఫాంగ్ పుయ్‌పై గెలవడంతో భారత ఆధిక్యం 2%-%0కు పెరిగింది.

# తుదిజట్టులో ఆ ఇద్దరు పక్కా.. మరీ అంతమంది ఎందుకు?: అశ్విన్

టీమిండియా సెలక్టర్ల తీరును భారత స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ విమర్శించాడు. చాంపియన్స్ ట్రోఫీ-2025కి ఎంపిక చేసిన జట్టులో ఐదుగురు స్పిన్నర్లకు చోటు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించాడు. తుదిజట్టు కూర్పు విషయంలో ఇబ్బందులు తప్పవని అభిప్రాయపడ్డాడు.

## యశస్వి జైస్వాల్‌ను తప్పించి

కాగా ఈ ఐసీసీ టోర్నీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి మంగళవారం తమ పూర్తిస్థాయి జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రాథమిక జట్టులో ఉన్న బ్యాటర్ యశస్వి జైస్వాల్‌ను తప్పించి.. అతడి స్థానంలో కొత్తగా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని చేర్చింది. అదే విధంగా.. జస్‌ప్రీత్ బుమ్రా గాయం కారణంగా దూరం కాగా.. హర్షిత్ రాణాకు పిలుపునిచ్చింది.

ఇదిలా ఉంటే.. ఇప్పటికే జట్టులో కుల్దీప్ యాదవ్‌తో పాటు ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌ల రూపంలో నలుగురు స్పిన్నర్లు ఉన్నారు. వరుణ్ రాకతో ఆ సంఖ్య ఐదుకు చేరింది. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు.

## నాకు అర్థం కావడం లేదు

"దుబాయ్‌కు ఇంతమంది స్పిన్నర్లను తీసుకువెళ్లడంలో మర్మమేమిటో నాకు అర్థం కావడం లేదు. యశస్వి జైస్వాల్‌పై వేటు వేసి స్పిన్నర్ల సంఖ్య ఐదుకు పెంచారు. ఈ పర్యటనలో ముగ్గురు లేదంటే నలుగురు స్పిన్నర్లు ఉంటారని ముందుగానే ఊహించాం.

కానీ దుబాయ్‌కు ఏకంగా ఐదుగురు స్పిన్నర్లతో వెళు తున్నామా? ఒకరు.. లేదంటే ఇద్దరు అదనంగా ఉన్నారని అనిపించడం లేదా?.. అందులో ఇద్దరు లెఫ్టార్మ్ స్పిన్నర్లు(రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్). ఇద్దరూ అత్యుత్తమ ఆటగాళ్లే.

పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాతో పాటు జడేజా, అక్షర్ తుదిజట్టులో ఉంటారు. కుల్దీప్ కూడా ఆడతాడు. ఇలాంటపుడు ఒకవేళ మీరు వరుణ్ చక్రవర్తిని కూడా జట్టులోకి తీసుకోవాలనుకుంటే.. ఓ పేసర్‌ను పక్కనపెట్టాల్సి ఉంటుంది.

అప్పుడు హార్దిక్ పాండ్యాను రెండో పేసర్‌గా ఉపయోగించుకోవాలి. లేదంటే.. స్పిన్నర్‌ను తప్పించి మూడో సీమర్‌ను తుదిజట్టులోకి తెచ్చుకోవాలి. నాకు తెలిసి కుల్దీప్ యాదవ్ నేరుగా ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకున్నాడు. మరి అప్పుడు వరుణ్‌కు ఎలా చోటిస్తారు?

